www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025
5
చిత్తూరు



పలమనేరులో పిజిఆర్ఎస్: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 5వ తేదీ సోమవారం పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్‌లో ప్రత్యేక ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించి పరిశీలించి పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించి పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం వల్ల చిత్తూరు జిల్లా కేంద్రంలో జరుగు ప్రజ సమస్యల పరిష్కారవేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పరిశ్రమల స్థాపనతోనే ఉపాధి కల్పన: కలెక్టర్

ప్రతి మహిళా ఓ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే లక్ష్యం : ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు

పరిశ్రమల స్థాపనతోనే ఉపాధి కల్పన జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పలమనేరులోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ లో తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన ఈస్ట్ మెన్ ఎక్స్పోర్ట్ కంపెనీ ద్వారా పలమనేరులో పనిచేసేందుకు పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి ప్రాంతాలలోని టైలరింగ్ అనుభవం ఉన్న స్వయం సంఘాల మహిళలకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు పలమనేరు ఎంఎల్ఏ ఎన్.అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతోనే ఉపాధి కల్పన జరుగుతుందని, ఈస్ట్ మెన్ ఎక్స్పోర్ట్ కంపెనీ ఏర్పాటుపై గతంలో వి.కోట, చిత్తూరులలో సమావేశం ఏర్పాటు చేశామని, పలమనేరులో ఈస్ట్ మెన్ ఎక్స్పోర్ట్ కంపెనీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించడానికి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. గార్మెంట్స్ ఏర్పాటు ద్వారా పలమనేరు పరిసర ప్రాంతాలలో దాదాపు 2 నుండి 4 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఎస్‌హెచ్‌జి మహిళలు శ్రమించి గార్మెంట్స్‌లో 8 గంటలు పని చేయగలమన్న నమ్మకం కలిగిస్తే ఈస్ట్ మెన్ ఎక్స్పోర్ట్ కంపెనీ స్థాపించడానికి యాజమాన్యం ముందుకు వస్తుందన్నారు. పలమనేరు పరిసర ప్రాంతాలలోని 1,200 మంది ఎస్‌హెచ్‌జి మహిళలకు టైలరింగ్ పై అవగాహన ఉన్నట్లు గుర్తించామని, వీరికి సంబంధించి మొబైలు నెంబర్‌లు సేకరించామని, సర్వే ద్వారా వారి నైపుణ్యంను పరిశీలించి గార్మెంట్ కంపెనీ ద్వారా ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేయడానికి కృషి చేస్తున్నదన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంభన లభిస్తుందనే ఉద్దేశ్యంతో పలమనేరు, వి.కోట, కుప్పంలో గతంలో అనేక గార్మెంట్స్ పరిశ్రమను తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గార్మెంట్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు రాష్ట్ర జిడిపి పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నదన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణంను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఇంటి వద్దనే ఉంటూ ఆర్థికంగా ఎదిగే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ శ్రీదేవి, ఈస్ట్ మన్ ఎక్స్ పోర్ట్స్ గ్లోబల్ క్లాథింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ రితేష్ కుమార్, జనరల్ మేనేజర్ మొయిద్దీన్, డిఐసి ఏడీ వెంకటరెడ్డి, ఏపీఐఐసి మేనేజర్ ఇస్మాయిల్, పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణ రెడ్డి, ఏపీఎంలు, డిపీఎంలు, సిసిలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

అనారోగ్యంతో ఏనుగు మృతి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం

అనారోగ్య సమస్యలతో మగ ఏనుగు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని మొగిలి సమీపంలో గల గౌన్ చెరువు వద్ద చోటు చేసుకుంది. అటవీ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత కొన్ని రోజులకు ముందు వేటగాళ్లు అమర్చిన నాటు బాంబును కొరకడం వలన ఏనుగు నోటికి తీవ్రంగా గాయపడింది. అప్పటి నుంచి ఏనుగుకు చికిత్స చేయాలనుకున్నా ఏనుగు సహకరించలేదని తెలిపారు. బాంబు పేలుడుతో నోటికి గాయమై ఆహారం సరిగా తీసుకోలేక ఏనుగు అనారోగ్యానికి గురై శనివారం మండలంలోని మొగిలి చెరువు వద్ద మృతి చెందిందని స్థానికులు గమనించి అటవీ శాఖ సిబ్బందికి తెలియజేశారు. అటవీ శాఖ సిబ్బంది శవ పరీక్ష అనంతరం ఖననం చేశారు.

అపోలో వద్దు.. ప్రభుత్వాసుపత్రే ముద్దు..

- ముదురుతున్న వివాదం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

చిత్తూరు నగరంలోని అపోలో వైద్యుల నిర్లక్ష్యం ఫలితంగా రోగులు బలైపోతున్నారంటూ అనేక సందర్భాల్లో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.. ప్రభుత్వ ఆసుపత్రి తీసుకున్న అపోలో యాజమాన్యం ప్రభుత్వ వైద్యులను నిర్లక్ష్యం చేస్తూ జూనియర్ డాక్టర్ల ద్వారా వైద్యం అందిస్తూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తోందంటూ గతంలోనే వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఉద్యమాలు నిర్వహించాయి. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అపోలో లీజును రద్దు చేయాలంటూ ప్రజా ఉద్యమాన్ని చేపట్టాయి.

ఇటీవల వారం రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ మహిళా ముఖ్య నాయకురాలు శ్రీదుర్గా మృతితో అపోలో వైద్యుల డొల్లతనం మరోమారు బహిర్గతమైంది. రోడ్డు ప్రమాదానికి గురైన శ్రీ దుర్గా తలకు తీవ్రగాయమైనప్పటికీ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని అపోలో వైద్యులు అంతా బాగుందంటూ ఇంటికి పంపించేశారు. అదే రోజు సాయంత్రం శ్రీదుర్గా మృతి చెందింది. తలకు గాయం కావడమే ఆమె మృతికి కారణమని పోస్టుమార్టంలో అపోలో వైద్యులే నిర్ధారించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కానింగ్, అల్ట్రా స్కానింగ్ ఇలా అనేక సౌకర్యాలు ఉన్నప్పటికీ శ్రీదుర్గకు స్కానింగ్ చేయకపోవడం పట్ల ఆమె తండ్రి బిసి సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షణ్ముగం అపోలో వైద్యుల నిర్లక్ష్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ అపోలో లీజును రద్దు చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తానంటూ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

గత తెలుగుదేశం పాలనలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో యాజమాన్యానికి లీజికిస్తూ 33 సంవత్సరాలు అగ్రిమెంట్ కుదుర్చుకుంది. అపోలో యాజమాన్యం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని లీజుకు తీసుకున్న తర్వాత తానే అంత అన్నట్లుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అపోలో కనుసన్నల్లో నడుస్తోంది. రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రెఫరల్ హాస్పిటల్‌గా మారిపోయిందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. తెలుగుదేశం మహిళా నాయకురాలు మృతితో హ్యూమన్ రైట్స్, ప్రజాసంఘాల నాయకులు, మృతురాలు శ్రీదుర్గ తండ్రి తన కుటుంబానికి జరిగిన అన్యాయం మరొకరికి జరగరాదంటూ గత ఐదు రోజులుగా జిల్లా కేంద్రంలోని ముఖ్యకూడళ్లలో అపోలో యాజమాన్యానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అపోలోకి ఇచ్చిన లీజును రద్దు చేసేంతవరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామంటూ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అపోలో యాజమాన్యం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని 33 సంవత్సరాలు లీజుకు తీసుకున్న తర్వాత అభివృద్ధి అంతంత మాత్రమే అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యవసర విభాగంలో సైతం జూనియర్ డాక్టర్లే కనిపిస్తున్నారు.


నగరంలో సంతకాల సేకరణ చేస్తున్న దృశ్యం

నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షల సందర్భంగా, పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎస్పీ మనికంఠ చండోలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పరీక్షా కేంద్రాలకు చేరేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నామని, అవసరమైన చోట్ల హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పరీక్షలో పాల్గొనే విద్యార్థులు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాసి తమ లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డ్ ప్రింటెడ్ కాపీని తీసుకొని పరీక్షా కేంద్రానికి రావాలని, పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలని ఐడీ ప్రూఫ్ (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, స్కూల్ ఐడి) తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ముఖ్యంగా నీలిరంగు బాల్ పాయింట్ పెన్ మాత్రమే అనుమతించబడుతుందని తెలిపారు. ఫేస్ మాస్క్ ధరించడం, సోషల్ డిస్టెన్స్ పాటించడం అవసరమన్నారు. అభ్యర్థులు తమ సాంప్రదాయ, సాంస్కృతిక, మత విశ్వాసానికి సంబంధించిన వస్తువులు ధరించిన అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి కనీసం రెండు గంటల ముందే రావాలని దీని వలన పరీక్షకు భంగం కలగకుండా తనిఖీ చేయవచ్చు అని తెలిపారు. అలాగే మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు తీసుకురావడం నిషేధమని, పెద్ద కవర్లు, బ్యాగులు, చేతి గడియారాలు, జ్యువెలరీ వంటి వస్తువులు వదిలివేయాలని, తిను బండారాలు, వాటర్ బాటిల్ లేదా ఇతర జల పదార్థాలు అనుమతించరని తెలిపారు. ఆలస్యంగా వచ్చే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని అభ్యర్థులు తమ సాంప్రదాయ, సాంస్కృతిక, మత విశ్వాసానికి సంబంధించిన వస్తువులలో అనుమానాస్పద పరికరం ఉంటే, పరీక్షా హాలులోకి అనుమతి ఇవ్వబడదన్నారు. పరీక్షలకు పిల్లల వెంట వచ్చే వారి తల్లితండ్రుల వాహనాలను పివికెఎన్ కాలేజీ మైదానంలో అనుమతించబడుతుందని తెలిపారు. పరీక్ష ముగిసే వరకు పివికెన్, సావిత్రమ్మ కాలేజీ చుట్టుపక్కల 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు వెలకట్టలేనిది కనుక, సరైన విధంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు.

5 నుంచి చిన్నారులకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపీలో ఆరేళ్ల లోపు పిల్లల కోసం ఈ నెల 5 నుంచి 8వ తేదీ తరువాత 12 నుంచి 15వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. చిన్నారుల బర్త్ సర్టిఫికెట్ తీసుకెళ్లి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు చేయించుకోవచ్చని వెల్లడించారు. జనన ధ్రువీకరణ పత్రం పొందిన 1.07లక్షల మంది పిల్లలు ఆధార్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆధార్ తీసుకొని ఉంటే సచివాలయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

పది శాతం ఓపీలకు

టీబీ పరీక్షలు తప్పనిసరి చేయాలి: డిఎంహెచ్ఓ


సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధారాణి ఆదేశాల మేరకు ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ల్యాబ్ టెక్నీషియన్లకు సమీక్ష సమావేశం జరిగింది. డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ 10 శాతం ఓపీలో తప్పనిసరిగా టీడీ పరీక్షలు చేయాలన్నారు. అలాగే పిహెచ్‌సిలో ప్రతి ఆశ కార్యకర్త ప్రతివారం గళ్ల పరీక్ష కిట్ల ద్వారా క్వాలిటీ గళ్ళను అనుమానిత కేసుల నుంచి సేకరించి పిహెచ్‌సిలో పరీక్షించాలని తెలిపారు. డాక్టర్లు సూపర్వైజర్లు వీటన్నింటినీ మానిటర్ చేస్తూ పాజిటివ్ వచ్చిన పేషెంట్స్‌కి చికిత్స ప్రారంభించి పూర్తి అయ్యేటట్లు చూడాలని అన్నారు. కొత్త కేసులకు ప్రతినెలా రూ.1000లు డిబిటి ద్వారా వారి అకౌంట్లో పౌష్టికాహారం నిమిత్తమై వేయబడుతుందని తెలిపారు. 2025కు టీబీ లేని సమాజస్థాపనే అందరి ధ్యేయమని అన్నారు. అలాగే అక్కడక్కడ డెంగీ కేసులు కనిపిస్తున్నందున రక్త పరీక్షలు విరివిగా చేపట్టాలని పీల్డ్‌లో ఆర్‌డిటి కిట్లు ద్వారా రక్త పరీక్షలు పరీక్షించాలన్నారు. ప్రతికేసును ఐహెచ్‌ఐపి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, సబ్ యూనిట్ అధికారులు రామకృష్ణ, శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని శనివారం వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జెడ్‌పి సీఈవో రవి కుమార్ నాయుడుకి వినతిపత్రం అందజేశారు. తుది మొత్తం చెల్లింపులు ఆలస్యం కాకుండా అడ్డంకులను తొలగించి త్వరగా చెల్లింపులు చేయాలనీ కోరారు. వార్షిక స్లిప్పులు వెబ్సైటులో మార్చి నెల వరకు పొందుపరచాలని కోరారు. పదవీ విరమణ తేది నాటికీ చెల్లింపులు జరిగేలా సాంకేతికంగా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డిశేఖర్ రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు సోమచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకాంత్ పాల్గొన్నారు.



దళితవాడ సమస్యలపై పరిశీలన

ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణంలో ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు ఏటిగడ్డ పాలెం దళితవాడను పరిశీలించారు. దళిత వాడ సమస్యలపై కమిషనర్ మధుసూదన్ రెడ్డి శనివారం పర్యటించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, శ్మశానవాటిక శుభ్రపరచాలని మాన్ కమిటీ సభ్యులైన సివిరెడ్డి, రామకృష్ణంరాజు, శ్రీకాంత్ దృష్టికి దళితవాడ ప్రజలు తీసుకెళ్లారు. దీంతో పుంగనూరు మునిసిపల్ అధికారులతో కలిసి ఏటీగడ్డపాళ్యం (దళితవాడ)లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని మునిసిపల్ కమిషనర్, అధికారులతో చర్చించి ప్రజల తాగునీరు సమస్య పరిష్కరించడానికి, శ్మశానవాటిక శుభ్రపరచడానికి త్వరలోనే పనులు మొదలుపెట్టి 10రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కమిషనర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష తనిఖీ

రాత పరీక్షకు 68.39 శాతం హాజరు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శనివారం ఉదయం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి ఎండల దష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల నిర్వహణ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్ రాత పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 623(68.39) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 288 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఇక్కడ చాలా డిఫ'రెంట్'...!

ఆర్టీసీ బస్టాండ్‌లో... షాపింగ్ కాంప్లెక్స్..!
మండుటెండలో రోడ్డుపైనే ప్రయాణికులు
29 పంచాయతీల పరిధిలోని జనం 'వ్యథ'

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

'ఆర్టీసీ బస్టాండ్ అనేది ప్రయాణికులకు వసతి కల్పించేలా, నీడ అందించేలా ఏర్పాటు చేసుకున్నది.. అయితే చాలాచోట్ల నిరుపయోగంగా ఉన్నాయన్నది నిర్వివాదాంశం.. బర్రెలను కట్టేసుకునే బస్టాండ్‌లూ ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.. అంతేకాదు చాలా చోట్ల యాచకులకు నిలయంగా మారిపోయాయి.. అయితే వరదయ్యపాలెం బస్టాండ్ పూర్తిగా డిఫ'రెంట్'.. షాపింగ్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసేసి వేలం వేసి బాడుగకు ఇచ్చేశారు.. దీంతో ప్రయాణికులు మండుటెండలో రోడ్డుపై మాడిపోవాల్సిందే. మండల కేంద్రం కావడంతో బస్సుల రాకపోకలు దాదాపు అర్థగంటపైనే వేచి ఉండాల్సి ఉంటుంది. నిల్చునే తోవ లేక, నీడలేక 29 పంచాయతీల పరిధిలోని ప్రయాణికుల 'వ్యథ'పై 'ప్రజాశక్తి' ఫోకస్.

వరదయ్యపాలెం మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్, వ్యాపారులకు అనువుగా తయారయ్యింది. బస్సు ఎక్కాలంటే ఏ చెట్టు కిందనో, వానలోనో తడుస్తూనే బస్సు ఎక్కే పరిస్థితి. ప్రయాణికులు ఇన్ని అవస్థలు పడుతున్నా, వారి బాధను అర్థం చేసుకున్న నాధుడే మండలంలో కరువయ్యాడు. సత్యవేడు నియోజకవర్గంలోనే ముఖ్యమైన మండలం వరదయ్యపాలెం. దాదాపు 29 పంచాయితీలతో అనేక గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా ఈ ప్రాంతం ఉంది. ఇక్కడి నుండి శ్రీ సిటీ, అపాచీ తదితర పరిశ్రమలకు అనేకమంది కార్మికులు, కూలీలు ఈ ప్రాంతంనుంచే ప్రయాణిస్తూ ఉంటారు. ముఖ్యంగా పల్లె ప్రజలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ వారి గమ్యాలను చేరుతూ ఉంటారు. అలాంటి ప్రయాణికులకు అణువుగా ఉండేందుకు బస్సు షెల్టర్ నిర్మించగా ఆర్టీసీ అధికారుల అత్యాశకు ప్రయాణికులు బలయ్యారు. బస్ షెల్టర్‌లో ప్రయాణికుల సౌకర్యం ఏర్పాటు చేయవలసిన కనీస వసతుల స్థానంలో వ్యాపారస్తుల కొరకు దుకాణ సముదాయం నిర్మించి అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. కనీసం కొంత ప్రాంతమైన ప్రయాణికుల కోసం వదిలిపెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులను ప్రశ్నించగా ఎటువంటి సమాధానం చెప్పకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనేకమంది ప్రయాణికులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధి సైతం ఈ సమస్యపై దష్టి పెట్టకపోవడం గమనార్హం.

దాతల సహాయం బూడిదలో పోసిన పన్నీరే

'అమ్మ భగవాన్ సేవాసమితి' వారు బస్టాండ్ సముదాయం ప్రాంగణంలో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి ఆ ప్రాంతమంతా అన్ని వసతులతో అభివద్ధి చేశారు. అదే సమయంలో తాగునీటి వసతి సైతం కల్పించి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా తగు చర్యలను తీసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత వాటిని ఆర్టిసి వారు పట్టించుకోకపోవడంతో దాతల సహాయం బూడిదలో పోసిన పన్నీరు అయ్యింది. తాగునీరు కాస్త బురద నీరు కాగా, ఆ దిమ్మెలా సమీపంలో అనేక తోపుడుబండ్లు ఏర్పాటు అయ్యాయి. ప్రయాణికుల అవస్థలు ఎవరూ పట్టించుకోకపోగా ప్రభుత్వ ఆస్తులను ఇలా ప్రైవేట్ వ్యక్తులు దోచుకుంటున్నారని ప్రశ్నిస్తున్న వారిని సైతం కొంతమంది దుకాణదారులు బెదిరించడం కొసమెరుపు.

పోలీసులకు సహకరించని పంచాయతీ అధికారులు

స్థానిక ఎస్సై మల్లికార్జున్ రోడ్డుకు అడ్డంగా ఏర్పాటైన దుకాణాలను అక్కడి నుండి ఖాళీ చేయించే ప్రయత్నం చేసినా తాము పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నామని స్థానిక పంచాయతీ అధికారులే ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి అనుమతిస్తున్నారని చెప్పడం కొసమెరుపు. పంచాయతీ అధికారులను ఆర్ అండ్ బి అధికారులను స్థానిక ఎస్సై సమన్వయం చేసుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకారం అందించాలని కోరగా వారి నుండి స్పందన రాకపోవడంతో అనేకసార్లు ప్రయత్నించిన స్థానిక ఎస్సై మిన్న కుండిపోవడం తప్ప చేసేదేమీ లేకపోయింది.

అక్రమ వసూళ్ల పైనే శ్రద్ధంతా..?

ఆర్టీసీ ప్రాంగణం మొత్తం వ్యాపారస్తులతో కిక్కిరిసిపోయి ఉంది. బస్టాండ్ ఆవరణంలో ముందు భాగం మొత్తం తోపుడుబండ్లతో నిండిపోయి ఉంది. ఆక్రమణ దారులను ఖాళీ చేయించకపోగా ప్రతిరోజూ పంచాయతీ వారు వాళ్ళ వద్ద నుండి కొంత నగదును అక్రమంగా వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో లేదన్న విమర్శలు లేకపోలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు బస్టాండ్ ఆవరణలో ఉన్న దుకాణదారులను ఖాళీ చేయించి ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదేగనుక జరిగితే మండుటెండలో ప్రయాణికులకు ఎంతో ఉపశమనం.



బస్టాండ్‌ను షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చేసిన ఆర్టీసీ

ఆర్‌టిసి ఆదాయం తగ్గుముఖం

- పెరుగుతున్న ఆటోల ఆదాయం
- ప్రయాణికుల సేవ విస్మరించడమే కారణం?
- అధికారులు దృష్టి సారించాలని వినతి

ఆర్‌టిసి ఆదాయం రోజురోజుకూ తగ్గుముఖం పడు తోంది.. మరో వైపు ఆటోల ఆదాయం పెరుగుతోంది.. ప్రయాణికుల సేవను విస్మరించడమే ఇందుకు కారణమని ప్రయాణికులు పేర్కొం టున్నారు. ప్రయాణికులు నిలిపిన చోట ఆర్‌టిసి బస్సులు నిలపడం లేదని వేగంగా వెళ్లిపోతున్నాయని, దిగాలనుకున్న స్టేజీ వద్ద ఆపడం లేదని ప్రయాణికులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా తాము పడరాన్ని పాట్లు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు తాము నిలిపిన చోటే ఎక్కించుకుని, దిగాలన్న చోట నిలుపు తున్నారని ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆర్‌టిసి ప్రజా సేవ పూర్తిగా లోపించిందని పై స్థాయి అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టి ఆర్‌టిసి ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని ప్రయాణికులు పేర్కొంటున్నారు.



ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఆర్‌టిసి ఆదాయం రోజురోజుకీ తగ్గ ముఖం పడుతోంది. ప్రయాణికులను ఆకర్షించేందుకు ఎన్ని స్కీములు ప్రవేశ పెట్టినా ఆటోల వైపే మొగ్గు చూపుతున్నా రని స్థానికులు పేర్కొంటున్నారు. ఆర్‌టిసి బస్సు ప్రయాణం సురక్షితం.. డ్రైవింగ్‌లో అన్ని విధాల రాటుదేలిన, నిపుణులు వుంటారు..ఇది అందరికీ తెలిసిన సత్యమే. అయితే ప్రయాణి కులు ఆర్‌టిసి బస్సు సర్వీసుల సేవలు తమకు ఉపయోగ కరంగా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెదురుకుప్పం మండలం నుంచి నిత్యం ఉపాధి కోసం, రైతులు ఎరువుల కోసం, తిరుపతి పట్టణం వైపు వచ్చి వెళుతుంటారు. పక్క రాష్ట్రమైన తమిళనాడు నుంచి దైవదర్శనానికి ఎక్కువ సంఖ్యలో తిరుమలకి వస్తుంటారు. ఇటు వైపు వచ్చే ప్రధాన మార్గాలలో వెదురుకుప్పం మండలం ఒకటి. ఇటువైపు ప్రయాణం చేస్తే దగ్గరగా త్వరగా చేరు కోవచ్చు. ఈ మండలం వైపు ప్రయాణం చేసే వారిని ఇది గమనించి ఆర్‌టిసి వారు గతంలో తిరుపతి డిపోకి చెందిన మేనేజర్ విశ్వనాథ్ ఈ రూటుపై తమ సిబ్బందితో కలిసి అధ్యయనం చేసి ఆర్‌టిసి బస్సుల సంఖ్యను పెంచారు. అప్పట్లో ప్రయాణికులు పెరిగి ఆదాయం బాగా పెరిగింది. దీంతో ఆ మేనేజర్‌కి అందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికీ ఆ సర్వీసులు అలాగే కొనసాగుతున్నాయి.

ఆదాయం ఎందుకు తగ్గుతోంది?

ఆర్‌టిసి వారు గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే సర్వీసులు చెయ్యి ఎత్తిన చోట ఆపబడును.. అడిగినచోట దించబడును' అనే నినాదంతో ముందుకు సాగారు. గతంలో ఈ నినాదం వర్తించింది. ఆర్‌టిసి వారు అనుకున్న లక్ష్యం సాధించారు.. ప్రయాణికులు పెరిగి ఆర్‌టిసి బస్సుల కోసం స్టేజీలు దగ్గర ఎదురు చూసేవారు.

ప్రస్తుత పరిస్థితి భిన్నం

పక్క రాష్ట్రమైన తమిళనాడు, మండలంలోని కేవలం దేవళం పేట, పెనుమూరు , బ్రాహ్మణపల్లి ప్రధాన రహదారులు ఉన్నాయి. ఈ మార్గాల ద్వారా రామచంద్రాపురం మండలం మీదుగా తిరుపతికి చేరుకుంటారు. అక్కడక్కడా స్టేజీల దగ్గర నిల్చొని ఉన్న ప్రయాణికులు చేయి ఎత్తి ఆర్టీసీ బస్సును ఆపితే ఆపకుండా వెళ్లిపోయిన సంఘటనలు ఎక్కువగా ఉన్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో వాళ్లు ఆటోలను ఆశ్రయి స్తున్నారు. కొంతమంది డ్రైవర్లు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, ప్రయాణికులు దిగవలసిన స్టేజిలో దింపకుండా ముందుకు వెళ్లి దింపడం.. ఇలా చేస్తున్నారు. డ్రైవర్లతో ప్రయాణికులు అక్కడక్కడా గొడవలకు దిగుతున్నారు. ఇది ఒక కారణమని ప్రయాణికులు చెబుతున్నారు.

స్టేజీలు మార్చి దించుతున్నారు..

గత నెల 27వ తేదీ వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం వద్ద ఓ వ్యక్తి తిరుపతికి వెళ్లేందుకు తిరుపతి వైపు వెళ్లే ఎస్‌ఆర్ పురం బస్సును సాయంత్రం 5.45 గంటల సమయంలో ఎక్కాడు. అతను తిరుపతిలో పాస్‌పోర్టు ఆఫీసు దగ్గర దిగాలి. ఆ రోజు విధులు నిర్వహిస్తున్న డ్రైవర్‌ని ఆ ప్రయాణికుడు పాస్‌పోర్టు కార్యాలయం వద్ద ఆపాలని అభ్యర్థించాడు. అయినా ఆ డ్రైవరు నిర్లక్ష్యంగా అవి ఏమీ లెక్క చేయకుండా ఆ ప్రయాణికుడిని లక్ష్మీపురం సర్కిల్‌లో దించి వెళ్లినట్లు ఆ ప్రయాణికుడు విలేకరి ముందు వాపోయాడు. ఇతను సమాజంపై కొంత పరిజ్ఞానం ఉన్న వ్యక్తి. తెలిసినవారికే ఇలా చేస్తే తెలియని వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని ఆ వ్యక్తి పేర్కొంటున్నారు.

పెరుగుతున్న ఆటోల ఆదాయం

రోజురోజుకీ ఆటోల సంఖ్య పెరుగుతోంది.. వెదురుకుప్పం మండలం నుంచి ఎక్కువ మంది ప్రయాణికులను తిరుపతికి చేరవేస్తున్నారు. ఆటో యజమానులు ప్రయాణికుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తారు. నిలిపి గౌరవంగా మాట్లాడి ఎక్కడికి వెళ్లాలి? అని తెలుసుకుని మరి ఎక్కించుకుంటారు. వారు అడిగిన దగ్గర దింపుతారు. దీంతో ఆర్‌టిసి బస్సును వదిలి, ఆటో ప్రయాణానికి ప్రయాణికులు ఇష్టపడుతున్నట్లు చెబుతున్నారు. ఫలితంగా ఆటోల ఆదాయం పెరుగుతోంది.. తిరుపతిలో సుమారు రెండు లక్షల ఆటోలు తిరుగుతున్నట్లు సమాచారం. ప్రయాణికుల సేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత డ్రైవర్లపై అధికారులు చర్యలు తీసుకుని ఆర్‌టిసి ఆదాయం పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఉచిత ఐస్ క్రీమ్‌లు, మజ్జిగ పంపిణీ చేస్తున్న దాత

ఉచిత ఐస్ క్రీములు, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: వేసవి తాపం నుండి ఉపశ మనం పొందేందుకు బంగా రుపాళ్యం మండలం లోని ఈశ్వర కళ్యాణ్ అభయ ఫౌండే షన్ యాజమాన్యం శనివారం వారపు సంత ను పురస్క రించు కొని మండల కేంద్రంలో ఐస్ క్రీములు, మజ్జిగ, తాగునీరు ఉచితంగా అందించారు అధిక సంఖ్యలో ప్రజలు ఉచిత ఐస్ క్రీము, మజ్జిగ, నీటిని తీసుకుని వేసవి తాపం నుండి ఉపశమనం పొందారు. ఈశ్వర కళ్యాణ్ అభియాన్ సేవా కార్యక్రమాలు బాగున్నాయని గతంలో శివరాత్రి పురస్క రించుకుని బంగారుపాల్యం నుండి మొగిలి వరకు ఉచితంగా బస్సులు నడిపారని సేవా కార్యక్రమాలు చేపట్టడం మంచి పరిణామమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర కళ్యాణ్ అభయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవాలయ భూదానానికి విరాళం అందిస్తున్న దాత

దేవాలయ భూదానానికి విరాళం

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవాలయ భూదానం కార్యక్రమానికి అమ్మవారి భక్తుల నుండి విశేష స్పందన లభిస్తోంది. అమ్మవారి భక్తుల సౌకర్యార్థం పట్టణంలో కొంత స్థలాన్ని కొనుగోలు చేయాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం అమ్మవారి భక్తులు సహకరించాలని ఆలయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పలువురు భక్తులు విరాళాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త రామలింగం దంపతులు భూదానం కోసం 15వేల రూపాయలు ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో అధ్యక్షులు బిఎంకె రవిచంద్రబాబుకు అందించారు. విరాళం అందుకున్న ఆలయ కమిటీ దాతలను సన్మానించారు.



మహాభారత ఉత్సవాలలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం చవటగుంట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ ద్రౌపది ధర్మరాజుల వారి 45వ మహాభారత మహోత్సవానికి గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే, విప్ వివిఎం థామస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం వెదురుకుప్ప ం క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శన కల్పించారు. తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ పూజారి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షులు లోకనాథరెడ్డి , జనసేన గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవిందయ్యకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి గోవిందయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సీఈ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్య వైవి రామిరెడ్డి పర్యవేక్షణలో "ఫిజికో కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ ఆర్గానిక్ లిక్విడ్ మిక్సర్ త్రూ ఎఫ్ టి ఐ ఆర్ స్పెక్ట్రల్ అనాలసిస్ 'అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీ కి సమర్పించారు. ఇందుకుగాను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కత్తెరపల్లి గోవిందయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశామని తెలిపారు.

నేడు మాజీ డిప్యూటీ సీఎం పర్యటన



ప్రజాశక్తి -వెదురుకుప్పం: మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి అడ్వైజర్ కమిటీ సభ్యులు కె నారాయణస్వామి ఆదివారం ఉదయం 10 గంటలకు వెదురు కుప్పం మండలంలో పర్యటిస్తున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి సుబ్రహ్మణ్యం శనివా రం ఓ ప్రకటనలో మీడియాకు తెలిపారు. వెదురుకుప్పం మండల కేంద్రమైన చవట గుంటలో జరుగుతున్న వార్షిక మహాభారత మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు మాజీ డిప్యూటీ సీఎం హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపిడివో బాలాజీ

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండలంలోని గ్రామ పంచాయతీలోని తల్లిదండ్రులు ఆరు సంవత్సరాల లోపు వయసు వున్న పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో బాలాజీ పేర్కొన్నారు. అందరూ పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే విధంగా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఆధార్ ప్రత్యేక శిబిరం సోమవారం ఈ నెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు, 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు నిర్వహించనున్నారని తెలిపారు. రాయలపేట, పెద్దపంజాణి, అమ్మ రాజుపల్లి, శంకర్రాయ ల్ పేట సచివాలయం పరిధిలో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దళితుల శ్మశానం కబ్జా

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: చౌడేపల్లి మండలంలోని పెద్ద ఎల్లకుంట్ల పంచాయతీ చిప్పిలి వారి పల్లెలో దళితుల శ్మశాన వాటిక కబ్జాకు గురైనట్లు బాధితులు తెలిపారు. వారి కథనం మేరకు.. చిప్పిలి వారి పల్లి గ్రామానికి సమీపంలో దశాబ్దాల తరబడి దళితులకు శ్మశాన వాటిక వుంది. ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నించగా కొద్ది రోజుల క్రితం అడ్డుకున్నా మని దళితులు తెలిపారు. కొన్ని రోజులు తర్వాత రాత్రి వేళలో మళ్లీ అదే వ్యక్తులు శ్మశానం బోర్డు స్థలంలో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించి ట్రాక్టర్లతో దున్ని కబ్జా చేశారని వారు వాపోయారు. ప్రభుత్వం అధికారులు స్పందించి దళితుల శ్మశాన వాటికను కబ్జా నుంచి విడిపించాలని చిప్పిలి వారి పల్లి దళితులు కోరుతున్నారు.



కబ్జాకు గురైన దళితుల శ్మశాన భూమి



శ్మశాన భూమిని కబ్జా చేసి సాగుచేసుకుంటున్న దృశ్యం



ఎమ్మెల్యే థామస్‌ను అభినందిస్తున్న క్రైస్తవ సోదరులు

సిఎస్ఐ చర్చి అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : స్థానిక సిఎస్ఐ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టరు వివిఎం థామస్ పేర్కొన్నారు. ఎస్ఆర్ పురం మండలం చిన్నతయ్యూరు సిఎస్ఐ కల్వరి మౌంటెన్ చర్చ్ ఆధ్వర్యంలో కుటుంబ ఆత్మీయత ఆరాధన సమావేశం శనివారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, జిడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వివిఎం థామస్ శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చి అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని పేర్కొన్నారు. అన్ని మతాలు ఒకటేనని హిందువైనా, ముస్లిం అయినా, క్రైస్తవులైనా అందరిదీ మానవత్వం మతం అని అన్నారు. అందరూ కలిసిమెలిసి వుండాలని సూచించారు. అనంతరం మత పెద్దలు చర్చికి రోడ్డు సౌకర్యం కావాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సిసి రోడ్డును త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యే డాక్టర్ వివిఎం థామస్‌ను మత పెద్దలు ఘనంగా పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జయశంకర్ నాయుడు, వేమన నాయుడు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నాగరాజు, పి మురళి, దాసరి సతీష్, సురేష్ ,మధు, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, సిద్దయ్య శెట్టి, ధనుంజయ నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పలమనేరు: పరిశ్రమల ఏర్పాటుకు పలమనేరు ఎంతో అనుకూలమైన ప్రాంతమని నూతన పారిశ్రామికవేత్తలకు పలమనేరులో పెట్టుబడులు పెట్టేలా అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు లోని తన కార్యాలయంలో శనివారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావుతో ఆయన సమావేశం అయ్యారు. పలమనేరు నియోజక వర్గంలోని గండ్రాజుపల్లె, పట్టణ సమీపంలోని పారిశ్రామిక వాడల్లో కొనసాగుతున్న సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నియోజక వర్గానికో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేస్తున్న అంశంపై ఈ సందర్భంగా చర్చించారు. పట్టణ సమీపంలోని నాగ మంగళం వద్ద ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గం లోని బైరెడ్డిపల్లి నుంచి వికోట వరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు చాలా అనువైన అవకాశాలు ఉన్నాయని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయాలనే ఆలోచన వున్న పారిశ్రామికవేత్తలకు ఆ దిశగా సూచనలిచ్చి ప్రోత్సహించాలని ఆయన జెడ్ఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ మేనేజర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఏపిఐఐసి జోనల్ మేనేజరు సుబ్బారావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అధ్వాన స్థితిలో ఆర్‌టిసి బస్టాండు

- నాగలాపురం బస్టాండుకు బస్సు రాని దుస్థితి - ప్రయాణికుల అవస్థలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం ఆర్టీసి బస్టాండు అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. బస్టాండు ఆవరణలో మల, మూత్ర విసర్జన చేయడం, రాత్రివేళలో మద్యం తాగడం వంటి కారణాల వల్ల బస్టాండు ఆవరణ అంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రయాణికులు బస్టాండులో నిలబడడానికి ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు చుట్టూ ఆటోలు నిండి ఉన్నాయి. ఇతర వాహనాలు పార్కింగ్ కోసం ఉపయోగిస్తున్నారు. నాల్గు నెలల క్రితం భారీ వర్షాలు కురవడం వల్ల నాగలాపురం ఆర్టీసి బస్టాండు గుంతల మయంగా మారింది. స్థానిక సర్పంచ్ చిన్నదొరై సుధా తన సొంత ఖర్చులతో గ్రావెల్ తోలి జెసిబి తో చదును చేశారు. ప్రయాణికులు బస్సుకోసం ఎండలోనూ, వానలోనూ వేచి ఉంటున్నారు. మౌలిక వసతులకు కూడా నోచుకోలేని స్థితిలో బస్టాండ్ ఆవరణ అధ్వానంగా మారింది. అంతేకాకుండా ఒక్క టి.పి.కోట మార్గంలో సత్యవేడు వెళ్లే బస్సులు తప్ప మిగతా ఈ బస్సులు బస్టాండు లోపలకి రావడంలేదు. బస్టాండు లోపల ప్రయానికు కూర్చోడానికి కుర్చీలు గాని ఫాన్లు గాని లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తిరుమల-చెన్నై ఎక్స్‌ప్రెస్ బస్సులు నాగలాపురం లోపలికి రావడంలేదు . దీనిపై పలు మార్లు తిరుమల డిపో మేనేజరుకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం, డిపో అధికారులు దీనిపై శ్రద్ధ వహించి నాగలాపురం ఆర్టీసి బస్టాండుకు మళ్లీ అన్ని బస్సులు వచ్చేలా, ప్రయాణికులకు కూర్చునేలా ఏర్పాట్లు చేయాలని నాగలాపురం మండలంలోని ప్రజలు కోరుతున్నారు.



అధ్వాన స్థితిలో వున్న నాగలాపురం బస్టాండు

కళత్తూరు సుబ్బారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూసిన సూళ్లూరుపేటకు చెందిన కళత్తూరు సుబ్బారెడ్డికి మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కళత్తూరు శేఖర్ రెడ్డి, కళత్తూరు కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నెలవల వెంట టీడీప నాయకులు మధు నాయుడు, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఏజి కిషోర్, మైలారి రాజశేఖర్, టీడీపీ నాయకులు ఉన్నారు.

జాబ్ మేళాలో 212 మంది ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, గోవింద పాలెంలోని శ్రీ విద్యా డిగ్రీ, ఎంబీఏ కళాశాలలో శనివారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన జాబ్ మేళాలో 30 యంఎన్‌సి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇంటర్వ్యూలలో 530 మంది పాల్గొనగా 212 మంది ఎన్నికైనట్లు కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి.ఉమామహేశ్వర్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకట ప్రసాద్‌లు తెలిపారు.

క్రైం న్యూస్

కొనసాగుతున్న దర్యాప్తు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం పట్టణం చిత్తరంజన్ వీధిలోని ఒక ఇంట్లో యువకుడు శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డ కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని ప్రముఖ వేద పండితులు బాబు స్వామి వద్ద బంధార్లపల్లి గ్రామానికి చెందిన చిరంజీవి డ్రైవర్‌గా పని చేస్తున్నాడని ఆత్మహత్యకు పాల్పడడానికి కారణాలు తెలియడం లేదన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



గాలివానకు కూలిన దాబా పైకప్పు రేకులు

గాలివానకు కూలిన హోటల్

ప్రజాశక్తి- పుంగనూరు: మండలంలో గాలి వాన జోరుగా రావడంతో స్థానిక బైపాస్ రోడ్ లోని ఓ దాబా రేకులు పైకి లేచి దూరంగా పడ్డాయి. శనివారం సాయంత్రం కురిసిన చిరుజల్లు లు, వీచిన గాలులకు దాబా కూలిపోయింది. భీమగాపల్లె శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం ఎదురుగా ఉన్న ఎస్ ఆర్ దాబా గాలీ వానకు కూలిపోయింది. దీంతో నిర్వాహకులు రోడ్డుపై పడ్డారు. కృష్ణదేవరాయల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ లైట్ పోలు విరిగిపోయింది.



రోడ్డుపై మొరాయించిన ఆర్‌టిసి బస్సు

మొరాయించిన ఆర్‌టిసి బస్

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు రెండో డిపోకు చెందిన కొత్త ఆర్టీసీ బస్సు నంబర్ ఏపీ39 యువి 6419 పలమనేరులో శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో నడిరోడ్డుపై కదలకుండా మొరాయించింది. ఈ సందర్భంగా డ్రైవర్‌ను వివరణ కోరగా ఈ కొత్త ఆర్టీసీ బస్సు తీసుకొచ్చి ఆరు నెలలు అయ్యిందని బెంగళూరు నుండి చిత్తూరుకు వెళుతుండగా పలమనేరు పట్టణంలో రహదారిపై మార్కెట్ వద్ద ఆగిపోయిందన్నారు. పూర్తి విషయం తెలియదని, బహుశా సెన్సార్ సమస్య ఉండొచ్చని తెలిపారు. ప్రయాణికులను దించి వేరే చిత్తూరు వెళ్లే బస్సు ఎక్కించి పంపించారు. ప్రయాణికులు బస్సు మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుకు గురయ్యారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను క్రమం తప్పకుండా తనిఖీ చేసిన తర్వాతే రోడ్డుపైకి పంపించాలని లేదంటే ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినట్లు అవుతుందన్నారు.

'వివాహం దివ్యత్వ సాధనం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, చెలికాని అన్నారావు సభాభవనంలో శనివారం రామకృష్ణ సేవా సమాజం పుదిపట్ల, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో వివాహం దివ్యత్వ సాధనం అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. జిఎస్సార్ కృష్ణమూర్తి, ఆముదాల మురళి, ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, డాక్టర్ సివి రెడ్డి, సంపాదకత్వం వహించిన గంగవరం శ్రీదేవి, రామకృష్ణ సేవా సమాజం పుధిపట్ల నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్ డాక్టర్ రూప రాజీనామా

ప్రజాశక్తి -కోట : కోట మండలం, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా 2 సంవత్సరాలనుండి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రూప శనివారం ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆమె స్థానంలో అక్కడే చిన్న పిల్లలు డాక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ పి.డోమ్ ప్రియా రావు బాధ్యతలు చేపడుతున్నట్లు సమాచారం.

డేటా సైన్స్‌కు మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో డేటా సైన్స్ చదివి ఉద్యోగాల ఇంటర్న్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ఎస్వీయూ ఇంచార్జ్ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు అభినందించారు. శనివారం విసి కార్యాలయంలో ఎన్ఏఆర్ఎల్, షార్, ఇస్రో వంటి సంస్థల్లో ప్లేస్‌మెంట్‌లను పొందిన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కొన్ని కొత్త కోర్సులను ఆవిష్కరించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎక్సాఫ్లూయెన్స్ ఇంక్., (యుఎస్ఏ)తో కలిసి పని చేసే నిపుణులతో విద్యార్థుల ప్రయోజనం కోసం డేటా సైన్స్‌లో కొత్త కోర్సులను విశ్వవిద్యాలయ అధికారులు ప్రకటించారు. 1.పిజి డిప్లొమా ఇన్ డేటా సైన్స్ – (1 సంవత్సరం వ్యవధి), 2. సర్టిఫికెట్ ఇన్ పైథాన్ ఫర్ ఎఐ, ఎంఎల్, జనరల్ ఎఐ – (6 నెలల వ్యవధి) 3.సర్టిఫికెట్ ఇన్ డేటా విజువలైజేషన్ – (6 నెలల వ్యవధి) 4.సర్టిఫికెట్ ఇన్ క్లౌడ్ టెక్నాలజీస్ –(6 నెలల వ్యవధి) వంటి కోర్సుల బ్రోచర్ ను వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ విడుదల చేశారు.

ఏఎస్ఐ షణ్ముగం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-నాగలాపురం: మండల కేంద్రం నాగలాపురం పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా షణ్ముగం శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఆయన గతంలో వరదయ్యపాలెంలో పనిచేస్తూ సాధారణ బదిలీపై నాగలా పురం స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు.